### వివాహ వేడుకలకు
## ఎమ్మెల్యే హాజరు

వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, మార్చి 28: చేగుంట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రవి కుమార్తె వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. తూప్రాన్‌లోని లక్ష్మీ గార్డెన్‌లో తేజస్వీని మహేశ్‌ల వివాహం జరిగింది. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, నాయకులు సురేశ్‌రెడ్డి, మ్యాకల సతీశ్‌కుమార్, సంపత్, వెంకటేశ్, ఊరడి యాదగిరి ఉన్నారు.

## పారదర్శకంగా పనిచేయాలి

బదిలీపై వెళ్తున్న ఉద్యోగినిని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ లింబాద్రి

రామాయంపేట, మార్చి 28: ప్రభుత్వ ఉద్యోగలందరికీ బదిలీ తప్పదని, ఎక్కడైనా పారదర్శకంగా పనిచేయాలని, అప్పుడే పేరు ప్రతిష్టలు దక్కుతాయని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి అన్నారు. గురువారం రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో పనిచేసిన సిబ్బంది బదిలీ కాగా వారి స్థానంలో 14 మంది నర్సులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చారని ఆయన తెలిపారు. బదిలీ అయిన సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ సుకేశిని, ప్రదీప్, మణికంఠ, జయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మెదక్ బార్ అసోసియేషన్
## అధ్యక్షుడిగా సుభాష్

మెదక్ అర్బన్, మార్చి 28: మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుభాష్‌చంద్రా గౌడ్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి శిరగ ప్రభాకర్ గురువారం తెలిపారు. మెదక్ బార్ అసోసియేషన్‌లో 85 మంది న్యాయవాదులకు ఓటు హక్కు ఉండగా 81 మంది ఓటేశారు. అధ్యక్షుడిగా సుభాష్ చంద్రగౌడ్ సమీప ప్రత్యర్థిపై ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీపతిరావు ప్రత్యర్థి సురేశ్ కుమార్‌పై 29 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కార్యవర్గ సభ్యులుగా శారద, చిరంజీవి, పరశురామ్‌గౌడ్, మిర్జా నజీర్ అలీ బేగ్, రమేశ్‌నాయక్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా దొమ్మాట దుర్గారెడ్డి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అశ్విన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రభాకర్ తెలిపారు.

## నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

రేగోడ్, మార్చి 28 : జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా అందోల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బుచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జోగిపేటలోని శ్రీరామా ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు హాజరు కావాలని కోరారు.

## బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

బీజేపీ పట్టణాధ్యక్షుడు భానుచందర్

రామాయంపేట, మార్చి 28: బీజేపీ పట్టణాధ్యక్షుడిగా దమ్మయ్యగారి భానుచందర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గురువారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా అవినాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఒలిసే సతీశ్‌రావు, కార్యదర్శులుగా రొయ్యల వినయ్, సంతోష్, యువమోర్చా పట్టణాధ్యక్షుడిగా పోచమ్మల కన్నయ్య, ఓబీసీ పట్టణాధ్యక్షుడిగా బైరం సిద్ధిరాములు, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా గావు రాధిక, గిరిజన మోర్చా పట్టణాధ్యక్షుడిగా గుగులోత్ భాస్కర్, దళిత మోర్చా అధ్యక్షుడిగా కొత్తపల్లి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు సందీప్, స్వామి ఎన్నికైనట్లు బీజేపీ నాయకులు చింతల శేఖర్, వెల్ముల సిద్ధిరాములు, రమేశ్, ఆకుల రమేశ్ తెలిపారు. శుక్రవారం మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు రామాయంపేటకు వస్తున్నట్లు, శారద హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

కలెక్టర్ రాహుల్ రాజ్

- గ్రామాలు, పట్టణాల్లో ఖాళీ బిందెలతో మహిళలు కనబడితే అధికారులపై చర్యలు
- ప్రతి గడపకూ మిషన్ భగీరథ తాగునీరు అందించాలి
- జిల్లాలో తాగు నీటి సరఫరాపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

మెదక్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో తాగునీటి సరఫరాపై గూగుల్ మీట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి, ప్రణాళికాబద్ధంగా మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. అన్ని గ్రామాల్లో వెంటనే బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్ చేయించాలని ఆదేశించారు. తాగునీరు వృథా కాకుండా గ్రామాల్లో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలతో అవగాహన కల్పించాలన్నారు. కార్యాచరణ ప్రణాళికపై వారంలోగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని మండలాలు, హబిటేషన్స్‌లో ఎక్కడైనా

పెద్దశంకరంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్

తాగు నీటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. తాగు నీటి పైప్ లైన్ లేని ప్రదేశాల్లో ట్యాంకర్ సహాయంతో నీటి సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు ముందే గ్రామాల వారీగా సమీక్షించుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో గ్రామాల్లో ఓహెచ్‌ఎస్ ట్యాంకులను శుభ్రంగా ఉంచి, వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

**తాగునీటికి ఇబ్బంది రావొద్దు**
**- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్**

పెద్దశంకరంపేట/ రేగోడ్, మార్చి 28 : వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయభాస్కర్ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ వాటర్‌మన్‌లకు తాగునీటి శాంపిల్స్ సేకరణపై అవగాహన కల్పించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ఆయా వాటర్ ట్యాంకుల్లో మూడు రకాలుగా వాటర్ శాంపిల్స్ సేకరించి రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. క్లోరినేషన్ తప్పకుండా చేపట్టాలని, పంచాయతీలకు క్లోరోసిప్ పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీకున్నీసా, ఏఈ రమేశ్, సిబ్బంది రమేశ్, కిషన్ ఉన్నారు.

**స్వచ్ఛమైన తాగు నీరందించాలి**

రేగోడ్ మండలంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలని డీఈ భాస్కర్‌రెడ్డి సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మన్‌లతో సమావేశం నిర్వహించి క్లోరినేషన్, బ్లీచింగ్, నీటి స్వచ్ఛత అనుసరించే విధానాలు తెలిపారు చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్, ఎంపీడీవో సీతారావమ్మ, సిబ్బంది ఉన్నారు.

## ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, మార్చి 28: రామాయంపేట పురపాలికలోని కోమటిపల్లి తండాలో కొత్తగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యేలు గురువారం సందర్శించారు. హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేదర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి హనుమాన్‌కు మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు. అనంతరం మైనంపల్లి హన్మంతరావు కార్యకర్తలతో ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో రామాయంపేట పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్ సుందర్ సింగ్, తండా నాయకులు రవి, సామ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌లో అంతర్ పంటలు

నార్సింగిలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వసంత సుగుణ

చేగుంట, మార్చి 28 : ఆయిల్‌పామ్‌లో అంతర్ పంటలు వేసుకోవచ్చని రామాయంపేట ఏడీఏ వసంతసుగుణ తెలిపారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన అబ్దుల్‌సత్తార్ ఐదెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. గురువారం ఏడీఏ ఆ పామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంటగా పచ్చిరొట్ట ఎరువులు, జీలుగు, జనుము, మినుములు, పెసర, ఆలసందలు వేసుకోవచ్చన్నారు. పంట తీసిన తరువాత దున్నేస్తే సారవంతమై ఆయిల్‌పామ్ మొక్కలకు ఉపయోపడుతుందని తెలిపారు. ఆమెతో ఏఈవో దివ్య, విజృంభన, రైతు సత్యం ఉన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు రిమాండ్

- ఇద్దరు మహిళలతో సహా ఐదుగురు వ్యక్తులు అరెస్ట్
- 12.5 తులాల బంగారు ఆభరణాలు, కారు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ బాలస్వామి

మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

తూప్రాన్, మార్చి 28: తూప్రాన్ బస్టాండ్‌లో చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, గురువారం రిమాండ్‌కు పంపినట్లు మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 27న తూప్రాన్ బస్టాండ్‌లో జరిగిన చోరీ కేసును తూప్రాన్ పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, కారు, 12.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన ఉప్పల శ్వేత కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గత నెల 27న తూప్రాన్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. 12.5 తులాల బంగారు ఆభరణాలను హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని, తూప్రాన్ బస్టాండ్‌లో బస్సు ఎక్కారు. బస్సు ఎక్కుతుండగా ముగ్గురు మహిళలు చాకచక్యంగా శ్వేత హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరిన కొద్ది సేపటికి శ్వేత హ్యాండ్ బ్యాగ్ తెరిచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆమె తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు తూప్రాన్ బైపాస్ వద్ద మహారాష్ట్రకు చెందిన నిందితులు విజయ్ సౌలంకి, హినా కరానా రహాడే, జయశ్రీ అంకుశ్ సౌలంకి, విజయ్ భీమ్‌రావ్ సౌలంకి, కరణ్ సంతోష్ రాథోడ్ ప్రయాణిస్తున్న కారును (ఎంహెచ్ 23 బీహెచ్ 1608) గుర్తించారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా తామే చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితులపై గతంలో సదాశివపేటలో 4, షాద్‌నగర్‌లో 2, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలవన్‌టౌన్‌లో ఒక్క కేసులో జైలుశిక్ష పడింది. నిందితుల నుంచి 12.5 తులా బంగారు ఆభరణాలు, వాగ్నార్ కారు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సై శివానందం, కానిస్టేబుళ్లు గోవర్ధన్, నాగేంద్ర బాబు, వెంకట్, కృష్ణ, సురేశ్‌లను ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు.

## ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

**- ఎస్పీ బాలస్వామి - దామరచెర్వు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టిన ఎస్పీ**

చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్పీ బాలస్వామి, సిబ్బంది

రామాయంపేట, మార్చి 28: చెక్‌పోస్టుల్లోని సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని ఎస్పీ బాలస్వామి తెలిపారు. గురువారం రామాయంపేట జాతీయ రహదారి దామరచెర్వు వద్దనున్న చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు. అక్కడున్న రికార్డులు పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అలర్టుగా ఉండాలని సూచించారు. జాతీయ రహదారిపై ఎన్నో రకాల వాహనాలు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి వాహనాన్ని కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. వాహనడిక్కి, సీట్ల కింది భాగంలో ఎలాంటి అనుమతి లేకుండా డబ్బు, మద్యం తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకుని వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉంటాయని, ఎంతటి వారికైనా భయపడేది లేదన్నారు. వాహనాలు నిలుపకుండా వెళితే పక్క చెక్‌పోస్టుకు వెంటనే సమాచారం చేరవేయాలన్నారు. ఎస్పీ వెంట రామాయంపేట సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్, సిబ్బంది ఉన్నారు.

## కన్నీటి పర్యంతమైన బాచారం

- పెండ్లి కూతురును తీసుకురావడానికి వెళ్లి ముగ్గురి దుర్మరణం
- మనువడి పెండ్లి ఆగిపోవడంతో తాత ఆత్మహత్య
- బాచారంలో ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట, మార్చి 28: పెండ్లికూతురును తీసుకురావడానికి వెళ్లి ట్రాక్టర్ బోల్తా పడ్డ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనతో మనువడి పెండ్లి ఆగిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన తాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచారంలో జరిగింది. బాచారం గ్రామానికి చెందిన సొంగ రమేశ్‌కు సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన మమతతో పెళ్లి కుదిరింది. గురువారం పెండ్లి జరగాల్సి ఉండగా పెండ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ అందోల్ మండలం మాసాన్‌పల్లి వద్ద బుధవారం సాయంత్రం బోల్తాపడింది. దీంతో పెండ్లి కొడుకు తరపున బంధువులు ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రమేశ్, మమత పెళ్లి ఆగిపోయింది. ఈ అనూహ్య ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన తాత పెంటయ్య గురువారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

**ఒకే రోజు నలుగురి అంత్యక్రియలు**

పెండ్లి కూతురిని తీసుకురావడానికి వెళ్లిన ట్రాక్టర్ బోల్తాపడి పెండ్లి కుమారుడి బంధువులు ఆగమ్మ(42), భూదెమ్మ (52), సంగమ్మ(45) మృతి చెందారు. మనువడి పెళ్లి ఆగిపోయిందని అతడి తాత సొంగ పెంటయ్య (65) ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గురువారం బాచారంలో నలుగురి అంత్యక్రియలు నిర్వహించారు. బాచారం గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాలను మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంత్‌రావు పరామర్శించి ఓదార్చారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

మనోజ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రేగోడ్, మార్చి 28: పోచారం గ్రామానికి చెందిన కార్యకర్త యాటకారి నర్సయ్య, మామిడి మనోజ్‌రెడ్డి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గురువారం పరామర్శించారు. ఆయనతో గ్రామాధ్యక్షుడు బాలయ్య, మాజీ అధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచులు సుంకె రమేశ్, నర్సింలు, సీనియర్ నాయకులు వట్‌పల్లి వరం చైర్మన్ వీరారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ, మండల స్థాయి నాయకులు రాచోటి సుభాష్, కృష్ణ యాదవ్, శ్రీశైలం యాదవ్, శరత్, ప్రతాప్ కుమార్ ఉన్నారు.

### ఎన్నికలు ముగిసే వరకు
## ప్రజావాణి రద్దు

**కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విధుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నందున ప్రజావాణిని రద్దు చేసినట్లు, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

### కొనసాగుతున్న
## 'పది' పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 28: పదో తరగతి పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు గురువారం జీవశాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 68 పరీక్ష కేంద్రాల్లో 10,300 మందికి 10,281 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు 38 మందికి 30 మంది, జిల్లాలో 99.82 శాతం హాజరైనట్లు తెలిపారు. పాపన్నపేట, నిజాంపేట, రామాయంపేట, శివ్వంపేట, తూప్రాన్ మండలాల్లోని పరీక్ష కేంద్రాలను డీఈవో రాధాకిషన్ తనిఖీ చేశారు.

## ఉపాధి పనుల పరిశీలన

చిలిపిచెడ్, మార్చి 28: ఉపాధి పనులను రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. గురువారం మండలంలోని చిట్కుల్ గ్రామ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతుల పొలాలకు వేస్తున్న మట్టిరోడ్డును పరిశీలించారు. కూలీల పని వేళలు, కొలతల ప్రకారం పరిమాణం, సగటు వేతనం గురించి అవగాహన కల్పించారు. ఆయనతో గ్రామ కార్యదర్శి తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం, ఉపాధి కూలీలు ఉన్నారు.

## చర్యలు తీసుకోవాలి

**★ ఎమ్మార్పీఎస్ టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్**

నిజాంపేట, మార్చి 28 : నిజాంపేట మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబుపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. గురువారం నిజాంపేటలో ఆయన మాట్లాడారు. మాజీ ఉపసర్పంచ్ బాబును కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన నలుగురిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు లింగం, రాజమల్లయ్య, జిల్లా అధ్యక్షుడు రాములు, శ్రీనివాస్ బాబు, సందీప్, ఎల్లం ఉన్నారు.

## మడూరులో వైద్యశిబిరం

చిన్నశంకరంపేట, మార్చి 28 : మండలంలోని మడూర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి డాక్టర్ నిహారిక వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పాపన్నపేట, మార్చి28: అనుమతులు లేకుండా మంజీరా నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని ఎంకేపల్లి గ్రామ శివారులో ఉన్న మంజీరా నది నుంచి బుధవారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్లు ఇమ్రాన్, కృష్ణ, సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నర్సరీల్లో గ్రీన్‌మ్యాట్లు ఏర్పాటు చేయాలి

సుతారిపల్లి నర్సరీలో గ్రీన్ మ్యాట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామాయంపేట, మార్చి 28: గ్రీన్ మ్యాట్లతో మొక్కలకు చల్లదనంతోపాటు ఎండిపోకుండా ఉంటాయని ఎంపీడీవో షాజిల్లా ఉద్దీన్ అన్నారు. గురువారం మండలంలోని సుతారిపల్లి, అక్కన్నపేట గ్రామాల్లోని నర్సరీలను సందర్శించి, కార్యదర్శులకు పలు సూచనలు సలహాలిచ్చారు. నర్సరీలో పెంచే ప్రతి మొక్కను కాపాడాలన్నారు. గ్రీన్‌మ్యాట్లు లేకుంటే ఎండలతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఆయన వెంట కార్యదర్శులు పద్మ, శ్యామల, సరిత, ఏపీవో శంకర్ ఉన్నారు.

## నిల్వనీటితోనే వ్యాధుల విస్తరణ

కోనాపూర్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్యసిబ్బంది, ఎంపీపీ భిక్షపతి

రామాయంపేట, మార్చి 28: మండలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు ఎంపీపీ నార్సింపేట భిక్షపతి తెలిపారు. గురువారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో పారిశుధ్య కార్మికులతో దోమల మందు పిచికారీ చేయించారు. ఎంపీపీ వెంట ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, బీఆర్ఎస్ నాయకులు దీపక్‌రెడ్డి, ఇమానియెల్ ఉన్నారు.

## యువతి వివాహానికి చేయూత

నార్సింగికి చెందిన కూరాకుల కనుకయ్య కూతురు వివాహానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యెర్రం బాబీ (శ్రవణ్‌కుమార్)పుస్తెమట్టెలు, వైస్ ఎంపీపీ సుజాతాశంకర్ పెండ్లి చీర అందజేశారు. - చేగుంట, మార్చి 28

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట మండలం చందాయిపేటకు చెందిన తలారి సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతా భాగ్యరాజ్ బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి, 50 కిలోల బియ్య, ఆర్థిక సాయం అందజేశారు. - చేగుంట, మార్చి 28